క్లుప్తంగా

దాడి కేసులో పదిమందికి జరిమానా

రామగిరి(నల్లగొండ): ఇంటి స్థలం విషయంలో దాడికి పాల్పడిన పది మందికి జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా ఎస్సీ ఎస్టీ కోర్టు జడ్జి ఎన్. రోజారమణి గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలు.. 2018 అక్టోబర్ 20వ తేదీన నల్లగొండ పట్టణంలో ఎన్టీఆర్ కాలనీకి చెందిన పేరుమాళ్ల వేణుకుమార్‌కు ఇంటి స్థలం వివాదంలో కాలనీకి చెందిన ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో వేణుకుమార్ అతడి కుటుంబ సభ్యులపై కాలనీవాసులు జెర్రిపోతుల వసంత, జెర్రిపోతుల నందని, కేసాని అంశమ్మ, కేసాని రాజు, పాలిశెట్టి అన్నపూర్ణ, సిలిగిరెడ్డి పుష్పలత, తల్లూరి యాదమ్మ, తన్నీరు పద్మ, గిలకల రేణుక, తన్నీరు పుష్ప దాడి చేశారు. దీంతో నల్లగొండ టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో వేణుకుమార్ ఫిర్యాదు చేశాడు. అప్పటి డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి విచారణ జరిపి చార్జీషీటు దాఖలు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నర్సింహ వాదనలతో ఏకీభవించిన జడ్జీ ఎస్.రోజారమణి నిందితులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

కళ్లద్దాల పంపిణీ

గట్టుప్పల్ : మండల పరిధిలోని నామాపురం గ్రామానికి చెందిన పలువురికి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. వారికి బుధవారం ఉచితంగా మందులు, కళ్లద్దాలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కంచుకట్ల సంపత్ అందజేశారు. కార్యక్రమంలో జాజుల యాదయ్య, రాములు, వెంకటేశ్, లింగయ్య, రాములు, సుదర్శన్, పద్మ, భీమనపల్లి యాదయ్య, అరుణ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

బయో కెమిస్ట్రీలో డాక్టరేట్



వీసీకి పరిశోధన పత్రం అందజేస్తున్న రాణిపద్మిని

నల్లగొండ టూటౌన్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీలో బయో కెమిస్ట్రీ అధ్యాపకుడు రామచందర్‌గౌడ్ పర్యవేక్షణలో ×బయో ఫిజికల్ ఇంటరాక్షన్స్ బిట్వీన్ గ్రీన్ కో బాల్ట్ నిఖిల్ బై మెటాలిక్ నానో పార్టికల్స్ విత్ సం బయో మాలిక్యుల్స్‌₹ అనే అంశంపై పరిశోధించిన రాణి పద్మిని డాక్టరేట్ అందుకుంది. ఎంజీయూ బయో కెమిస్ట్రీ విభాగం నుంచి మొట్టమొదటి పర్యావరణ రహిత పరిశోధనకుగాను సూర్యాపేటకు చెందిన రాణి పద్మిని డాక్టరేట్ అందుకున్నట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. రాణి పద్మినికి ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అలువాల రవి, బయోకెమిస్ట్రీ అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

అల్పాహారం అందజేత

నకిరేకల్ : పట్టణంలోని వేణు మిల్ స్టోర్స్ సహకారంతో నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఏరియా ఆస్పత్రిలో 100 మందికి అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్, అల్పాహారం దాత బ్రహ్మదేవర వేణు, క్లబ్ ప్రతినిధులు సూర్యచంద్రరావు, అండెం వెంకన్న, ఎస్.రాంమోహన్‌రావు, ఎల్లపురెడ్డి యాదగిరెడ్డి, ఉప్పల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్, ప్రింటర్ బహూకరణ



కంప్యూటర్, ప్రింటర్ అందజేస్తున్న సుజాత

మునుగోడు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు పీఈటీ గాదరి మారయ్య జ్ఞాపకార్థం అతడి కుమారుడు, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ రూ.లక్ష విలువగల కంప్యూటర్, స్కానర్, ప్రింటర్‌లను గురువారం మారయ్య సతీమణి సుజాత చేతుల మీదుగా అందజేశారు. హెచ్‌ఎం కె.బాలప్రసాద్, ఉపాధ్యాయులు కె.సత్తిరెడ్డి, రాజేశ్వర్, అన్నపురెడ్డి, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, రత్నయ్య, బాబురావు, సబిత, లక్ష్మి, గీత, వాణి పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణం యజమానిపై కేసు నమోదు

రామగిరి(నల్లగొండ): ఎమ్మార్పీ కంటే అధిక ధరకు యూరియాను విక్రయిస్తున్న నల్లగొండ మండలంలోని దోమలపల్లి గ్రామంలో గల శ్రీకనకదుర్గ ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణం యజమానిపై గురువారం కేసు నమోదయింది. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తనిఖీలు నిర్వహిస్తుండగా సబ్సిడీపై సరఫరా చేస్తున్న యూరియా ధర, స్టాక్ వివరాలు దుకాణం ఎదుట పట్టికలో ప్రదర్శించకపోవడంతో అనుమానం వచ్చి రశీదు బుక్ పరిశీలించారు. అందులో కల్వలపల్లికి చెందిన రైతు వంటెపాక సైదులు, కన్నెబోయిన శంకర్, బీరెల్లిగూడెంకు చెందిన దాసరి భిక్షంలకు యూరియా బస్తా ఎమ్మార్పీ రూ. 266 బదులు రూ.350 విక్రయించినట్లు గుర్తించారు. షాపు యజమాని పగిడమర్రి విగ్నేష్, సహాయకులు మొగుదాల శివ, శీలం లింగమూర్తిలపై నల్ల గొండ రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

స్కూల్‌కు డుమ్మా కొడితే మాస్టారే ఇంటికొస్తారు



విద్యార్థులను పాఠశాలకు తీసుకొస్తున్న ఉపాధ్యాయుడు మహేష్

నాంపల్లి : మండలంలోని దామెర ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గురిజ మహేష్ పాఠశాలలో డ్రాపవుట్స్ లేకుండా విశేషంగా కృషి చేస్తున్నాడు. ప్రభుత్వ పాఠశాల బలోపేతం చేయడమే ఆ ఉపాధ్యాయుడి లక్ష్యం. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించడమే కాకుండా విద్యార్థులు పాఠశాలకు డుమ్మా కొడితే వారు ఎక్కడ ఉన్నా అక్కడికి వెళ్లి బైక్‌పై పాఠశాలకు తీసుకొస్తున్నాడు. ఇంటి వద్ద ఉన్నా, వ్యవసాయ పొలాల వద్ద ఉన్నా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యత గురించి వివరించి తన బైక్‌పై పాఠశాలకు తీసుకొస్తున్నాడు. 13 ఏళ్లుగా డ్రాపవుట్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. దీనికి తోడు పాఠశాలకు అవసరమైన పరికరాలు, విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్నారు. అదేవిధంగా స్వచ్ఛంద సంస్థల సహకారంతో పేదలకు సహాయం చేస్తున్నాడు.

బాల కవులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుడు



విద్యార్థులతో ఉపాధ్యాయుడు రామ్మూర్తి

తిప్పర్తి : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు పండిత్‌గా పనిచేస్తున్న దొడ్డి రామ్మూర్తి తాను కవితలు రాస్తూ.. విద్యార్థులతో రాయిస్తూ వారి మేధస్సును పెంచుతున్నాడు. ఇప్పటివరకు తన ఉద్యోగ సర్వీసులో సుమారు 40 మంంది విద్యార్థులను రచయితలుగా, కవులుగా తీర్చిదిద్దాడు. విద్యార్థులు రాసిన పుస్తకాలను ప్రచురించి పలువురికి పంపిణీ చేశాడు. తిప్పర్తి ఉన్నత పాఠశాలలో సుమారు 20మందిపైగా విద్యార్థులకు కథలు, రచనలు, కవితలు రాయడం నేర్పించాడు. ఎక్కడ పనిచేసినా అక్కడ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పనిచేస్తున్నాడు. తెలుగుభాష అభ్యున్నతి చాటుతున్న ఉపాధ్యాయుడు రామ్మూర్తి సేవలను గుర్తించి ప్రభుత్వం 2008లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు, 2014లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందజేసింది.

తెలుగు భాషపై ఆసక్తి పెంచడానికి కృషి చేస్తున్నా

నేను ఎక్కడ పనిచేసినా అక్కడ విద్యార్థులు తెలుగు భాషపై ఆసక్తి పెంచడానికి కృషి చేస్తున్నా. విద్యార్థుల్లో ఆలోచన శక్తిని పెంచడానికి, ప్రశ్నించేతత్వం, సామాజిక స్పృహ సృజనాత్మకత పెంచడానికి కవితలు, రచనలు, వ్యాసాలు రాయడం నేర్పిస్తున్నా. విద్యార్థులను బాల కవులుగా తీర్చిదిద్దాలన్నాదే నా ఉద్దేశం. – దొడ్డి రామ్మూర్తి, తెలుగు భాషా ఉపాధ్యాయుడు తిప్పర్తి

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని వైఆర్పీ ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చిలుముల బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బొమ్మపాల గిరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రావు, ఎన్నికల పరిశీలకులు రామ్మోహన్, ఉపేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

నల్లగొండ టూటౌన్ : కుక్కల వల్ల ముప్పు, వాటి ద్వారా వచ్చే ప్రమాదాలపై నల్లగొండ మున్సిపల్ అధికారులు గురువారం బొట్టుగూడ, పానగల్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గడ్డం శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు



మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా జీఎస్టీని తగ్గించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలు, రైతులు, మధ్యతరగతి వారిని దృష్టిలో ఉంచుకొని గృహ వినియోగ వస్తువులపై జీఎస్టీని తగ్గించడంతో జీవన వ్యయం గణనీయంగా తగ్గనుందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో పెరిగిన ధరలు, పెరిగిన పన్నుల భారంతో ఇబ్బంది పడిన ప్రజలకు.. ప్రస్తుతం జీఎస్టీ తగ్గింపుతో ఎంతో మేలు చేస్తుందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు పిండి పాపిరెడ్డి, గోలి ప్రభాకర్, కారింగుల యాదయ్య, బీపంగి జగ్జీవన్, కనకయ్య, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి ఆటల పోటీలు



నకిరేకల్ : బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

నకిరేకల్ : పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థుల మండల స్థాయి అండర్–14, అండర్–17 విభాగం ఆటల పోటీలు (కబడ్డీ, ఖోఖో, వాలీబాల్) గురువారం ముగిశాయి. నకిరేకల్ మండలంలోని 15 పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. విజేతలకు నకిరేకల్ పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు రూ.10 వేలు విలువ చేసే బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత, ఎంఈఓ మేక నాగయ్య, స్థానిక హెచ్‌ఎం రాములు, ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి, పీడీలు విద్యాసాగర్‌రెడ్డి, రాపోలు శైలజ, సిద్దు, నిమ్మల శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దామెరభీమనపల్లి విద్యార్థుల ప్రతిభ

మర్రిగూడ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి బహుమతులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉదావత్ లచ్చిరాం తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను ఆయన గురువారం పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.మంజులత, కొండ శ్రీనివాస్, వెంకట్‌కుమార్, మీనా పాల్గొన్నారు.

గణిత పరిశోధనపై విద్యార్థులకు అవగాహన



ప్రొఫెసర్ కాత్యాయనిని సన్మానిస్తున్న అధ్యాపకులు

నల్లగొండ టూటౌన్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీలో గణిత విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు గురువారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్నాటక అధ్యాపకులు డా.శ్రీనివాసుల బల్లెం, యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ కాత్యాయని, ప్రొఫెసర్ విజయ బాలాజీ గణిత పరిశోధన, భవిష్యత్‌లో గణితంపై రానున్న అనువర్తనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ గణిత విభాగం చేపట్టిన రెండు రోజుల జాతీయ సదస్సు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. పరిశోధనలపై విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో జాతీయ సదస్సు కన్వీనర్ మద్దిలేటి పసుపుల, కో కన్వీనర్స్ డా.జి.ఉపేందర్‌రెడ్డి, డా.డి.హైమావతి, గణిత అధ్యాపకులు డా. శ్రీనివాస్, డా.కిరణ్‌కుమార్, రామచంద్ర, ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ ఆర్టీసీ డిపో మేనేజర్ బదిలీ

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనాథ్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎంవీ రమణ నియామకమయ్యారు. అదేవిధంగా నల్లగొండ డిపోలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పని చేస్తున్న సునితకు డిపో మేనేజర్‌గా ప్రమోషన్ రాగా.. ఆమె సత్తుపల్లి డిపోకు బదిలీ అయ్యారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

నగదు రహిత లావాదేవీలు నిర్వహించాలి

చండూరు : నాబార్డు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీలపై గురువారం చండూరులోని రైతు సేవా సహకార సంఘంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కోడి సుష్మవెంకన్న పాల్గొని నగదు రహిత లావాదేవీల ఆవశ్యకత, అక్షరాస్యత, సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ మేనేజర్ భరత్, సెక్రటరీ అమరేందర్, ఇఫ్కో టోక్యో ఇన్సూరెన్స్ మేజర్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

‘రీజినల్’ అలైన్‌మెంట్ మార్చాలని ధర్నా

గట్టుప్పల్ : తేరట్‌పల్లి, నామాపురం, గట్టుప్పల్ గ్రామాల్లో రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ ఆయా గ్రామాల రైతులు గురువారం గట్టుప్పల్ తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారు రాములుకు వినతిపత్రం అందజేశారు. పట్టా భూముల్లో సేద్యం చేసుకుని జీవనం కొనసాగిస్తున్నామని, తమ భూముల నుంచి కాకుండా ప్రభుత్వ భూముల నుంచి ట్రిబుల్‌ఆర్ వెళ్లేలా చూడాలన్నారు.

డ్రమ్ముల వితరణ

నకిరేకల్ : పట్టణంలోని వైకుంఠధామంలో నీటి సమస్య ఉన్న కారణంగా స్థానికులు బ్రహ్మదేవర రవిశంకర్, మూర్త నాగయ్య గురువారం రెండు డ్రమ్ములు, 12 బకెట్లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నకిరేకల్ పట్టణంలోని వైకుంఠధామంలో అనేక సమస్యలు ఉన్నాయని, అధికారులు పరిష్కరించాలని కోరారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

కేతేపల్లి: విద్యార్థులు ప్రతిరోజు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవాలని ఇనుపాముల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ముషం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని ఇనుపాముల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోషకాహార అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ ఆకు కూరలు, కోడిగుడ్లు, ఆయా సీజన్‌లో దొరికే పండ్లను తీసుకోవాలన్నారు. ఎస్‌ఎంసీ చైర్మన్ ఎస్.రాధిక, మాజీ సర్పంచ్ జాల వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్, కె.వెంకట్‌రెడ్డి, కె.లక్ష్మీనారాయణ, ఎస్.దీప్తి, పి.సుగుణమ్మ, వై.ఎల్లయ్య, ఎండీ.అజీజ్ అహ్మద్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు ప్రారంభం

గట్టుప్పల్ : మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న కురుమ సంఘం భవనానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. కాగా ఆ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సామల యాదయ్య, భీమగాని మల్లేశం, నామని బుచ్చయ్య, బండారు అంజయ్య, పగిళ్ల యాదయ్య, శంకరయ్య, వావిళ్ల యాదయ్య, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కట్టంగూర్ : సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కట్టంగూర్ మండల ప్రత్యేక అధికారి జి.సతీష్‌కుమార్ అన్నారు. గురువారం కట్టంగూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూరిబా పాఠశాలను ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్ రావుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. విష జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కస్తూరిబా పాఠశాలలో వైద్య సిబ్బంది విద్యార్థులను నిర్వహించిన పరీక్షలను పరిశీలించారు. అనంతరం పీఏసీఎస్ గోదాంలో రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శ్వేత, పంచాయితీ కార్యదర్శి అశోక్ తదితరులు ఉన్నారు.

యూరియా కొరతతో రైతుల అవస్థలు



శాలిగౌరారం : తిరుమలరాయునిగూడెంలో బారులుదీరిన రైతులు



కట్టంగూర్ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం గుమికూడిన రైతులు

శాలిగౌరారం: మండలంలోని ఎరువుల దుకాణాలు, పీఏసీఎస్‌లో యూరియా నిల్వలు లేకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మండలంలోని తిరుమలరాయునిగూడెం ఎన్‌డీసీఎంఎస్ ఎరువుల దుకాణానికి 20 టన్నులు(444 బస్తాలు) యూరియా శుక్రవారం రానుండడంతో గురువారం సుమారు 350 మంది రైతులు యూరియా కొనుగోలు రశీదుల కోసం క్యూ కట్టారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి సౌమ్య శృతి సిబ్బందితో అక్కడకు చేరుకుని రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా కొనుగోలు రశీదులు అందజేశారు. 222 మంది రైతులకే యూరియా లోడ్ అయిపోవడంతో లైన్‌లో నిల్చున్న సుమారు 120 మంది రైతులు నిరాశతో వెనుదిరిగిపోయారు.

నకిరేకల్ : యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. నకిరేకల్‌లోని తాటికల్ పీఏసీఎస్ వద్దకు యూరియా వస్తుందని తెలుసుకున్న మండలంలోని పలు గ్రామాల రైతులు గురువారం యూరియా కోసం అధిక సంఖ్యలో వచ్చి బారులుదీరారు. మొత్తం 20 టన్నుల (444 బస్తాలు) యూరియా లోడ్ దిగుమతి కాగా వచ్చిన 222 మంది రైతులకు ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున యూరియా అందించామని పీఏసీఎస్ సీఈఓ నాగారాజు తెలిపారు.

కట్టంగూర్ : యూరియా కొరతతో మండలంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కట్టంగూర్ పీఏసీఎస్‌కు గురువారం 444 బస్తాల యూరియా రావడంతో విషయం తెలుసుకున్న రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. రైతులు అధిక సంఖ్యలో రావడంతో ఏఓ గిరిప్రసాద్ సింగిల్ విండో సిబ్బంది, ఎస్‌ఐ రవీందర్, పోలీసు సిబ్బంది సహకారంతో ఆధార్ కార్డుకు ఒక యూరియా బస్తా చొప్పున పంపిణీ చేశారు.

తిప్పర్తి : యూరియా కోసం రైతులు పడిగాపులు కాయక తప్పడంలేదు. రోజుల తరబడి రైతులు పడిగాపులు కాసినా సరిపడా యూరియా అందడం లేదు. గురువారం రాత్రి సమయంలో యూరియా పంపిణీ చేస్తుండడంతో తిప్పర్తి మండల కేంద్రంలోని ఆగ్రోస్ దుకాణం ఎదుట రైతులు బారులుదీరారు. ఒక్కో రైతుకు ఒకటి లేదా రెండు బస్తాల చొప్పున యూరియా ఇస్తున్నారు. ఐదు నుంచి పదెకరాల పొలం ఉన్న రైతులకు యూరియా సరిపోక ప్రతిరోజూ యూరియా కోసం తిరుగుతున్నారు.

మునుగోడు: యూరియా మార్కెట్‌లో అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. పది రోజులుగా అడపాదడపా మునుగోడు పీఏసీఎస్ కార్యాలయానికి యూరియా సరఫరా అవుతోంది. గురువారం యూరియా కోసం మునుగోడు పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతులు బారులుదీరారు.

రాష్ట్రంలో రాజ్యమేలుతున్న దళారీ వ్యవస్థ

● మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



చిట్యాలలో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల: సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో దళారీ వ్యవస్థ రాజ్య మేలుతోందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. రైతులకు సరిపడా యూరియా ఎరువులు సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ గురువారం చిట్యాల తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యూరియా సరఫరా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమై రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని విమర్శించారు. రైతులు రూ.266 యూరియా బస్తాను దళారుల వద్ద రూ.600లకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అధికార పార్టీ నాయకులు అధికారులను బెదిరించి యూరియాను బ్లాక్ చేస్తున్నారని ఆరోపించారు. మార్పు కోసం కాంగ్రెస్‌కు ఓట్లు వేసిన ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధమయ్యారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, వెంకటేష్‌గౌడ్, రాచకొండ కిష్టయ్య, మర్రి జలందర్‌రెడ్డి, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, బొబ్బల శివశంకర్‌రెడ్డి కందాటి రమేష్‌రెడ్డి, బాతరాజు రవిందర్, పొట్లపల్లి చిన్నస్వామి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

చిట్యాల : పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం బీజేపీ చిట్యాల పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. వార్డుల్లో సీసీరోడ్లు నిర్మించి లైటింగ్ వ్యవస్థను మెరుగుపరచాలని, భువనగిరి రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించి డివైడర్ ఏర్పాటు చేయాలని కోరారు. శివనేనిగూడెం పోతరాజుకుంటలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును మరోచోటుకు మార్చాలని, అమృత స్కీం 2.0 పనులను పూర్తి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మాస శ్రీనివాస్, చికిలంమెట్ల అశోక్, కన్నెబోయిన మహాలింగం, పల్లె వెంకన్నగౌడ్, గంజి గోవర్దన్, దామరోజు నాగరాజు, కన్నెబోయిన మురళి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

నల్లగొండ టౌన్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ పట్టణంలోని జీజీహెచ్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరాన్ని డీఈఓ భిక్షపతి సందర్శించి మాట్లాడుతూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి, కార్యదర్శి జే.శేఖర్‌రెడ్డి, భిక్షం, రణదీవే నర్రా శేఖర్‌రెడ్డి, గేర నర్సింహ, వెంకన్న, రమాదేవి, సైదులు, మురళయ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మూసీకి 1,774 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గురువారం ప్రాజెక్టులోకి 1,774 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్టు అధికారులు రెండు గేట్లను ఒక అడుగు మేర ఎత్తి 1,724 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా ప్రస్తుతం 643.50 అడుగుల నీరు నిల్వ ఉంచి నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 408 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.07 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవం



కట్టంగూర్ : సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కట్టంగూర్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం కట్టంగూర్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎంలు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు శాలువాలు కప్పి, మెమొంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు.

తిప్పర్తి : మండలంలోని కేశరాజుపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జయరాములు, మాజీ కౌన్సిలర్ ఆనంద్ కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, సులోచన, కరుణ, సునిత, నాగరాజు, విజయ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

మునుగోడు: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మునుగోడు ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను క్లబ్ సభ్యులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మిర్యాల వెంకటేశం, నారబోయిన సుధాకర్, మిర్యాల వెంకన్న, మధుకర్, రావిరాల కుమారస్వామి, హెచ్‌ఎంలు సుంకరి భిక్షంగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తిప్పర్తి : కేశరాజుపల్లి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



మునుగోడు: ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

దిగుమతి సుంకం రద్దును ఉపసంహరించుకోవాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చండూరు : కేంద్ర ప్రభుత్వం ముడి పత్తిపై 11శాతం దిగుమతి సుంకం రద్దును ఉపసంహరించుకోవాలని కోరుతూ గురువారం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నలపరాజు రామలింగయ్య మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి నష్టం చేసే ఫారం గ్రేడ్ అగ్రిమెంట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుంకం రద్దు నిర్ణయంతో దేశీయ పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.25లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్, రైతు సంఘం కార్యదర్శి బండమీది వెంకన్న, నాయకులు తిప్పర్తి రాములు, జక్కలి పరమేశ, సీపీఐ మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య, దోటి వెంకన్న, ఊషయ్య, సంజీవ తదితరులు పాల్గొన్నారు.